సాక్షి చిత్తూరు
శుక్రవారం । 31 । మే । 2024



పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలుంటాయని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య హెచ్చరించారు. - 8లో



ప్రకృతి సాగును విస్తరించాలి

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. - 8లో



టీటీడీకి పది టన్నుల కూరగాయలు

పలమనేరు నుంచి కాప్పల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో తిరుమలకు పది టన్నుల కూరగాయలను వితరణగా అందజేశారు. - 8లో

న్యూస్‌రీల్

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలొద్దు

చిత్తూరు అర్బన్: దేశ వ్యాప్తంగా చివరి విడత ఎన్నికలు పూర్తి కానుండడంతో ఎగ్జిట్ పోల్స్ వస్తాయని.. వీటి ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో ఎవ్వరూ కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయ వద్దని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇతర గ్రూపుల్లో ఇష్టానుసారం పోస్టులు పెడుతూ, ప్రత్యర్థులను కవ్వించేలా పోస్టులు పెట్టకూడదని తెలిపారు. అసత్యాలను ప్రచారం చేసినా, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ సోషల్ మీడియా గ్రూపుల్లో అయినా అనుచిత వ్యాఖ్యల పోస్టులు వస్తే ఆ గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

శ్రీరంగరాజపురం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని ఆరిమాకులపల్లె ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై రోగులను ఆరా తీశారు. అనంతరం ఆయన ఆరోగ్య, ఆశ సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే జ్వరాలు, ఇతర వ్యాధులపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించాలన్నారు. ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వైద్యాధికారులు గౌరి, బాల సుబ్రమాణ్యంరెడ్డి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,56,85,501

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.1,56,85,501 ఆదాయం లభించింది. ఆలయంలో గురువారం 20 రోజులకు హుండీ కానుకలను లెక్కించారు. బంగారం 400 గ్రాములు, వెండి 1.855 కిలోలు లభించాయి. గో సంరక్షణ హుండీ కానుకుల ద్వారా రూ.12,036, నిత్య అన్నదానం హుండీ నుంచి రూ.22,550, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏవీ 352 డాల్లర్స్, యూఏఈ 35 దిర్హామ్, మలేషియావి 10 రింగిట్, కువైట్‌వి 10 దీనార్‌లు లభించినట్లు దేవస్థానం ఈఓ వెంకటేశు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

టమాట పొలాలపై ఏనుగుల విధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన టమాట బాక్సులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట పంచాయతీ దాసనంపల్లె సమీప పంట పొలాలపై బుధవారం రాత్రి గజరాజులు దాడి చేశాయి. రైతు లక్ష్మమ్మకు చెందిన 70 బాక్సుల టమాటాలను గంకొండ అటవీ ప్రాంతం నుంచి వచ్చిన రెండు ఏనుగులు ధ్వంసం చేశాయి. పొలం వద్ద మార్కెట్‌కు తరలించేందుకు బాక్సుల్లో సిద్ధంగా ఉంచిన టమాటాలను సగం తిని, సగం తొక్కి నాశనం చేశాయి. గురువా రం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు పంట ధ్వంసమై ఉండడాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ దాడుల్లో రూ.20వేల మేరకు పంట నష్టం జరిగినట్లు అంచనా. ఏనుగులు దాడి చేసిన ప్రాంతాన్ని గురువారం రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెలపై కాలుష్య పడగ

చిత్తూరు మండలంలో పలు ఫ్యాక్టరీలు కాలుష్యంతో గ్రామీణులపై విషం చిమ్ముతున్నాయి. యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యర్థాలను బయటకు వదులుతుండడంతో విషవాయువుల కోరల్లో గ్రామీణులు చిక్కుకుంటున్నారు. ఓ వైపు భూగర్భ జలాల్లోకి విషవాయువులు కలిసిపోతుండగా మరో వైపు దుర్గంధంతో రోగాలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. సాగు భూములు బీళ్లుగా మారుతున్నాయి. రసాయనాలు కలిసిన గ్రాసం తిని పాడి ఆవులు మృత్యువాత పడుతున్నాయి. కాలుష్య కారక పరిశ్రమలపై అధికారులు ఉక్కుపాదం మోపకుంటే పర్యావరణానికి, జీవకారుణ్యానికి ముప్పు తప్పదని నిపుణులు సూచిస్తున్నారు.



చిత్తూరు మండలంలో ఓ ఫ్యాక్టరీ వెనుక భాగంలోని చెరువులోకి వదిలేసిన రసాయనిక నీరు



- విషం చిమ్ముతున్న ఫ్యాక్టరీల వ్యర్థాలు
- యథేచ్ఛగా పొలాల్లోకి రసాయన నీరు
- దుర్గంధంతో గ్రామీణుల ఉక్కిరిబిక్కిరి
- ప్రజలను చుట్టుముడుతున్న రోగాలు
- పాడి ఆవులు మృత్యువాత.. బీళ్లుగా పంటపొలాలు
- అధికారుల ఆదేశాలు భేఖాతర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలో బీఎన్‌ఆర్‌పేట మీదుగా వెళ్లే రోడ్డులో పలు ఫ్యాక్టరీలున్నాయి. ఇందులో హానికరమైనవి కొన్ని ఉన్నాయి. రసాయన వ్యర్థాలను యథేచ్ఛగా బయటికి వదిలేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. కేసులు కూడా నమోదయ్యాయి. ఫిర్యాదులు అందినప్పుడల్లా అధికారులు తనిఖీలు చేస్తూ చర్యలు చేపడుతున్నారు. యాజమాన్యాలు కొన్ని రోజులకే ఆ షరతులను పక్కన పెట్టి..మళ్లీ యథావిధిగా తమ పనులను చేసుకుంటున్నాయి. ఫ్యాక్టరీల కాలుష్యాలతో జీవాలు, మనుషుల ప్రాణాలకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉన్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయా ప్రాంతాల గ్రామీణులు పేర్కొంటున్నారు. ఓ ఫ్యాక్టరీ వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని గుర్తించి అధికారులు మూడేళ్ల కిందట సీజ్ చేశారు.

ఇళ్లు, పంటలపై విషం

ఓ ఫ్యాక్టరీ నుంచి వెలువడే నల్లటి రసాయనికి పొడి ఇళ్లు, పంటలపై పడుతోంది. ఈ పొడి పడిన భూమిలోని గడ్డి తిన్న పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతంలో ఆవులు పదుల సంఖ్యలో మృతి చెందాయి. దీంతో చాలా మంది పాడి ఆవుల పెంపకాన్నే వదిలేశారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వచ్చే వర్థాలను వెనక భాగంలోని చెరువులోకి వదిలేస్తున్నారు. వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కాలుష్యం అవుతున్నాయని స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా అతీగతీ లేదు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఒక ఫ్యాక్టరీ ప్రజల ప్రాణాలను సైతం లెక్క చేయడం లేదు. ఏకంగా ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలను బోరుబావి గుండా భూమిలోకి వదిలేస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా ఆఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో తాగునీటి బోర్లలో నీరు రంగు మారింది. పంటలు పండడం లేదు. దీంతో రైతులు పంటల సాగు మానేశారు. రోగాలు చుట్టుముడుతున్నాయి. దద్దుర్లు వస్తున్నాయి. చుట్టుపక్కల గ్రామస్తులు దుర్గంధం భరించలేకపోతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు రెండేళ్ల కిందట కాలుష్య నియంత్రణ శాఖకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారులు ఫ్యాక్టరీని తనిఖీ చేసి కొన్ని శాంపిల్స్ సేకరించారు. కాలుష్యం వాస్తవమని తేలడంతో ఫ్యాక్టరీకి తాళం వేసి కరెంట్ కట్ చేశారు. యాజమాన్యం మళ్లీ కొన్ని షరతులతో ఫ్యాక్టరీన్ని పునఃప్రారంభించింది. అయితే అదే దుర్గంధంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా విచ్చలవిడిగా రోడ్లకు ఇరువైపులా డంప్ చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఫ్యాక్టరీలను యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు లోబడి నిర్వహించాలి. ప్రజలకు హాని కలిగించేలా వ్యవహరిస్తే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళుతాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. వ్యర్థాలను బయటికి వదలిస్తే ఊరుకోం. ఫ్యాక్టరీల వల్ల ఇబ్బందులు వస్తే ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. కచ్చితంగా జిల్లా అధికారులతో పాటు సంబంధిత శాఖ అధికారులకు తెలియజేసి చర్యలు తీసుకునేలా చూస్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, చిత్తూరు

భరించలేక పోతున్నాం

మా గ్రామ సమీప ఫ్యాక్టరీ నుంచే వచ్చే దుర్గంధం భరించలేక పోతున్నాం. రాత్రి పూట ఎక్కువగా దుర్గంధం వస్తోంది. నీళ్లు కూడా కలుషితమవుతున్నాయి. పంటలు పండడంలేదు. ఆవులు చనిపోతున్నాయి. గతంలో ధర్నాలు చేశాం. అధికారులు కూడా వెంటనే స్పందించారు. ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. అయినా ఎలాంటి నివారణ చర్యలు లేవు. అధికారులే మమల్ని కాపాడాలి.

– అశోక్, చిత్తూరు మండలం

ప్రజారోగ్యం దెబ్బతింటోంది

మండలంలోని పలు ఫ్యాక్టరీల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం వల్ల ప్రజలు ఆరోగ్యపరంగా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రైతులు పంట సాగు మానేశారు. మేము గతంలో పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేశాం. అధికారులు తనిఖీ చేసి ఒక ఫ్యాక్టరీకి తాళం వేశారు. ఇంకా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


– ఎంఎస్ బాబునాయుడు, చిత్తూరు మండలం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఫ్యాక్టరీ నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. ప్రజలకు హానిచేసే విధంగా ఫ్యాక్టరీ నడప కూడదు. ఇబ్బందులపై ప్రజలు ఫిర్యాదు చేస్తే చాలు. ఏ ఫ్యాక్టరీ మీద అయితే ఫిర్యాదు వస్తోందో.. ఆ ఫ్యాక్టరీని తనిఖీ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతాం. కాలుష్యమని తేలితే కఠినంగా వ్యవహరిస్తాం. వ్యర్థాలను చెరువుల్లోకి వదిలినా నిబంధనలు ఉల్లంఘించినట్లే.

– అశోక్‌కుమార్, ఈఈ, పొల్యూషన్ బోర్డు, తిరుపతి

నిఘా నేత్రం..భద్రతకు ఛత్రం



ఆలయంలో సీసీ కెమెరా

కాణిపాకం దేవస్థానంలో సీసీ కెమెరాల నిఘా పటిష్టంగా ఉండడంతో చోరీలకు అడ్డుకట్ట పడుతోంది. గురువారం హుండీ కానుకల లెక్కింపు సమయంలో ఓ బ్యాంకు అప్రైజర్ 100 గ్రాముల బంగారు బిస్కెట్, చేతి ఉంగరం, రూ.500 నోటును నొక్కేశాడు. సీసీ కెమెరాల పర్యవేక్షకుడు ఇది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో అసలు విషయం బయటపడింది. ఆభరణాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే నాలుగేళ్ల కిందట హుండీ కానుకలు లెక్కిస్తూ..రూ. 26వేలతో ఒకరు పట్టుబడి పోలీసులకు చిక్కాడు.

- కాణిపాకంలో పటిష్టంగా నిఘా నేత్రం
- అడగడగునా సీసీ కెమెరాలు ఏర్పాటు
- అప్రమత్తంగా ఆలయ అధికారులు, సిబ్బంది
- చోరీలు, అవకతవకలకు అడ్డుకట్ట



సీసీ కెమెరా కంట్రోల్ రూమ్

కాణిపాకం : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ గట్టిగా పని చేస్తోంది. కన్నుసన్నల్లో కొట్టేయాలని చూస్తే కనిపెట్టేస్తోంది. ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. సాధారణ రోజుల్లో 10వేలకు పైగా భక్తులు వస్తున్నారు. సెలవు రోజులు, పండుగలు, బ్రహ్మోత్సవాల సమయంలో 30నుంచి 40 వేల వరకు భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. భక్తులు విరాళాల రూపంలో రూ. లక్షల్లో నగదు సమర్పిస్తున్నారు. విదేశీ కరెన్సీలు, బంగారం, వెండి ఆభరణాలను కూడా కానుకల రూపంలో అందజేస్తున్నారు. అన్నదానం ట్రస్టు, గో సంరక్షణ ట్రస్టు పేరిట రూ. లక్షల్లో విరాళాలు వస్తుంటాయి. టికెట్లు, ప్రసాదాల విక్రయం, ఇతరాత్ర మార్గాల ద్వారా కూడా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. వీటిని భద్రపరచడంలో నిఘా వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ..ఆలయ భద్రతకు భంగం వాటిల్లకుండా చూస్తున్నారు.

నిఘా వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం

రాష్ట్రంలో పలు ఆలయాలపై జరిగిన విధ్వంసం, చోరీలను కట్టడి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందడగు వేసింది. కొన్ని కుట్రలను తిప్పికొట్టేందుకు నిఘా వ్యవస్థకు ప్రాణం పోసింది. సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో ఆలయాల పరిరక్షణ సులభతరమైంది. ప్రస్తుతం ఆలయం చుట్టూ 112 సీసీ కెమెరాలున్నాయి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. ఆలయ లోపలి భాగంతో పాటు పరిసరాల్లో, ఆలయానికి చెందిన వసతి గదుల్లో సీసీ కెమెరాలను బిగించి భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో పాటు ఆలయ పర్యవేక్షణకు ఐదుగురు ఏఈఓలు, ముగ్గురు పర్యవేక్షకులు పనిచేస్తున్నారు. వీరితో పాటు హోంగార్డులు 35 మంది, ప్రైవేటుగా తొమ్మిది మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా ఆలయ భద్రతతో పాటు భక్తులను అప్రమత్తం చేస్తూ చోరీలకు తావు లేకుండా పనిచేస్తున్నారు.

హుండీ లెక్కింపు పక్కా

దేవస్థాన హుండీ కానుకల లెక్కింపు 15–20 రోజులకు ఒక్కసారి లెక్కిస్తారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈఓ, ముగ్గురు ఏఈఓలు, పర్యవేక్షకులు పర్యవేక్షిస్తారు. హోంగార్డులు నలుగురు, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్‌ఐ విధుల్లో ఉంటారు. ఆలయ సిబ్బంది 60 మంది, సేవకులు 20 మంది కలిసి కానుకలు లెక్కిస్తారు. ఆలయ అధికార బృందం పర్యవేక్షించడంతో పాటు మూడో కన్ను నిఘా పెడుతోంది. సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌లో లెక్కింపు పర్యవేక్షిస్తుంటారు. ఫలితంగా భక్తుల కానుకలకు భద్రత ఉంటుంది. గురువారం జరిగిన చోరీ కూడా సీసీ కెమెరా విభాగం ద్వారానే బయట పడింది. అధికారులు తక్షణం స్పందించి చేతివాటం ప్రదర్శించిన వ్యక్తిని పట్టుకున్నారు.



హుండీ కానుకల లెక్కింపు

తప్పు చేస్తే వదిలిపెట్టం



ఇది పవిత్రమైన దేవాలయం. ఇక్కడ తప్పు చేయాలని చూస్తే భగవంతుడు వదలిపెట్టడు. నిఘా వ్యవస్థ అసలు వదలదు. సీసీ కెమెరాలన్నీ పక్కాగా పనిచేస్తున్నాయి. హుండీ లెక్కించే సమయంలో ఆ విభాగాన్ని గట్టిగా పని చేయిస్తున్నాం. అధికారులంతా అప్రమత్తంగానే ఉంటారు. ఏవరైనా సరే సొమ్ము కాజేయాలని చూస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం. కేసులు పెట్టిస్తాం.

– వెంకటేశు, ఆలయ ఈఓ, కాణిపాకం

నిఘా నీడలో ఓట్ల లెక్కింపు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి నిఘా నీడలో సాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన ఎస్వీ సెట్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఏచిన్న పొరబాటు కూడా తలెత్తకూడదని చెప్పారు. భద్రతా చర్యలు పక్కాగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు హాల్‌కు సులువుగా చేరుకునేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, తాగునీటికి అనుమతి లేదన్నారు. కేంద్రం వెలుపల తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫోన్‌లు డిపాజిట్ చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఆర్‌ఓలు ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలించుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. మీడియా సెంటర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్లు, టీవీలు, కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. అనంతరం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, ఇతర అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయంచపై వీణాపాణి కటాక్షం



చిన్నశేష వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు



వీణాపాణిగా హంస వాహనంపై స్వామివారి విహారం

కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం రాత్రి హంస వాహనంపై సరస్వతీ దేవిగా, ఉదయం చిన్న శేషవాహనంపై విహరిస్తూ స్వామి వారు భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7.30కు శ్రీస్వామివారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఐదు పడగల చిన్న శేషవాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం చెక్క భజనలు, కోలాటాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు మొదలైంది. 9-30 గంటల వరకు ఊరేగింపు సాగింది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, నారికేళ జలంతో అభిషేకించారు. పవిత్ర తులసి మాలలతో అలంకరించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ వేదోక్తంగా సాగింది. రాత్రి ఏడు గంటలకు హంస వాహన సేవ ప్రారంభమైంది. శ్రీస్వామి వారు వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శుక్రవారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపు పందిరిపై స్వామివారి విహారం ఉంటుందని ఆలయ అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు

పలమనేరు: పాలిసెట్ 2024లో స్వల్ప మార్పులు జరిగినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మహమూద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 6న సర్టిఫికెట్ల పరిశీలన, ఏడు నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, 13న సీట్ల కేటాయింపు, 14 నుంచి తరగతుల ప్రారంభం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడాల్సి ఉన్నందున 30 పోలీస్ చట్టం, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రభుత్వం ఈ మార్పులు చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని అందులో సూచించారు.

ప్రేమ పేరుతో బాలికను మోసం చేశాడని ఫిర్యాదు

చౌడేపల్లి: బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడని అందిన ఫిర్యాదు మేరకు దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లెకు చెందిన ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి గురువారం తెలిపారు. ప్రేమపేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కులం వేరని, తల్లిదండ్రులు ఒప్పుకోలేదంటూ ఆనంద్ చెప్పడంతో వారం కిందట బాలిక ఆత్మహత్యకు యత్నించింది. ఈమేరకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వీఆర్‌కు పంపిన కారు..!

- అధికారిక వాహనం దుర్వినియోగంపై చర్యలు
- చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్ బదిలీ

పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరుగుతున్నా.. గ్రామాలకు గ్రామాలే అల్లర్లతో అట్టుడికిపోతున్నా.. ఆ అధికారి వైఖరిని ఎవరూ పట్టించుకోలేదు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను గాలికి వదిలేసినా ఆయనపై చర్యలు తీసుకునేందుకు పోలీసు ఉన్నతాధికారులు వెనకడుగు వేశారు. తనను ఎవరూ ఏమి చేయలేరనే నిర్లక్ష్యం, నిలువెల్లా అహంకారంతో విర్రవీగిన ఆ అధికారి గర్వాన్ని ఓ కారు అణచి వేసింది. అసలు సంగతి ఏంటంటే.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కేటాయించి కారును దుర్వినియోగం చేసినందుకు చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌పై వేటు పడింది. ఆయనను వీఆర్‌కు బదిలీ చేస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.


శరత్‌రాజ్‌కుమార్ (ఫైల్)

తిరుపతి రూరల్ : చంద్రగిరి డీఎస్పీగా శరత్‌రాజ్‌కుమార్ మూడు నెలల క్రితం గోదావరి జిల్లాల నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలు ఉన్నాయి. ఆయన అలసత్వం వల్లే రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు ఆయన గన్‌మన్, డ్రైవర్, అనుచరులపై దాడులు చేసి, కార్లను కాల్చివేసినా ఆయన నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పెట్రోలు పోసి తగలబెట్టినా చూసీ చూడనట్లు వ్యవహరించారు. అప్పుడే డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని అందరూ భావించారు. అయితే పోలీసు అధికారులు మాత్రం ఆవైపుగా దృష్టి సారించలేదు.

ప్రైవేటు వ్యక్తికి అప్పగింత

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కారును కేటాయించింది. పద్మావతి వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఆయన తన కారును తాజ్ హోటల్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల యాజమాని వ్యక్తిగత అవసరాల కోసం పంపించారు. ఆయన దానిని పలు రకాలుగా ఉపయోగించుకుని బుధవారం సాయంత్రం కారుతో సహా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. డీఎస్పీ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధుల్లో ఉంటే కారులో వస్తున్న వ్యక్తి ఎవరూ అంటూ గేటు వద్ద పోలీసులు ప్రశ్నించారు. తాను డీఎస్పీకి చాలా దగ్గరని, స్ట్రాంగ్ రూమ్ వద్దకు వెళ్లాలని సదరు కారులో ఉన్న ప్రైవేటు వ్యక్తి దబాయించాడు. పోలీసులను బెదిరించి కారును స్ట్రాంగ్ రూమ్ వైపు తీసుకెళ్లాడు. దీనిపైస్పెషల్ బ్రాంచ్ పోలీసులు వెంటనే ఎస్పీకి సమాచారం అందించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, స్ట్రాంగ్ రూం వద్ద ప్రైవేటు వ్యక్తి సంచారాన్ని ఎస్పీ గుర్తించారు. డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి రిపోర్ట్ పంపారు. వెంటనే డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, వీఆర్‌కు పంపించాలని డీజీపీ ఆదేశించారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వెళ్లి డీఎస్పీకి ఉత్తర్వులు అందించారు. నడిరోడ్డుపైనే ఆయన నుంచి అధికారిక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

క్రైమ్ డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరికి ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల పరిధిలో అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. కౌంటింగ్ ముందు, కౌంటింగ్ రోజు, తర్వాత రోజు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో సమీక్షించారు.

ప్రకృతి సాగును విస్తరించాలి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఔత్సాహిక వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు సమావేశ భవనంలో వ్యవసాయ శాస్త్రవేత్తలుగా శిక్షణ పొందుతున్న వారికి ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పొలంలో ఏ గ్రేడు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ ఏడాదికి నిర్దేశించిన లక్ష్యాలకు మించి ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో రైతు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రైతు శాస్త్రవేత్తలుగా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం వాసు, టీపీటీ పుష్ప, డీపీపీ దివ్య, ఎస్ఎఫ్ఏ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

2న ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో జూన్ 2వ తేదీన ఫుట్‌బాల్ జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జూనియర్ బాలురు, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31,2010 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 8712139311 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

2న క్రికెట్ జట్ల ఎంపిక

తిరుపతి రూరల్ : 2024-25 క్రికెట్ సీజన్‌కు గాను జూన్ 2న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-16(బాలురు), అండర్-23 (పురుషులు) క్రికెట్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-23 విభాగానికి 2001 సెప్టెంబర్ 1 నుంచి 2008 ఆగస్టు 31లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అండర్-16 విభాగానికి 2008 సెప్టెంబర్ 1 నుంచి 2010 ఆగస్టు 31 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. అండర్-16 క్రీడాకారులు ఉదయం 8 గంటలకు, అండర్-23 క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు క్రీడా మైదానం చేరుకోవాలని వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి తోపాటు ఆధార్ కార్డు, ఫాం-5 పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 9849026131, 7981880381లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు ఆయన గురువారొ ఒక ప్రకటన విడుదల చేశారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు


తిరుమలకు కూరగాయలను పంపుతున్న దాతలు

పలమనేరు: పట్టణానికి చెందిన శ్రీవారి సేవకుడు కాప్పల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ట్రాన్స్‌పోర్ట్ యజమానులు మోహన్‌రెడ్డి, పరంధామరెడ్డి, ఓకేఆర్ మండీ నిర్వాహకులు రెడ్డెప్పరెడ్డి, రాజేందర్‌రెడ్డి తమ సొంత నిధులతో తిరుమల శ్రీవారి ఉచిత అన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలను వితరణగా అందజేశారు. గురువారం పట్టణం నుంచి తిరుమలకు టీటీడీ ప్రత్యేక వాహనంలో వీటిని పంపారు. ఈ సందర్భంగా వాహనానికి పూజలు నిర్వహించారు. బాబు, సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యం విక్రేత ఎన్.రమేష్ (42)ను టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్టేషన్ ఆవరణలో మీడియాకు సీఐ ఉలసయ్య వివరాలు వెల్లడించారు. సంతపేట ఇందిరానగర్ వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్‌ఐ ప్రసాద్ సిబ్బంది తవరాజ్, బాబు తదితరులతో కలిసి దాడి చేశారు. రమేష్ అనే వ్యక్తి ఇందిరానగర్ వద్ద రెండు బాక్సుల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 192 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారు. కాగా రమేష్‌పై గతంలో ఏడు క్రిమినల్ కేసులు ఉండగా, ఇతడిపై రౌడీషీట్ తెరిచేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు సీఐ తెలిపారు.

వివిధ చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం: వివిధ చోరీ కేసుల్లో ముగ్గురుని వెదురుకుప్పం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని వ్యవసాయ పొలాల్లో బోరు మోటార్లు, జేసీబీలకు అమర్చిన బ్యాటరీలు చోరీలకు గురైనట్లు ఇటీవల పోలీసులు ఫిర్యాదులు అందాయి. వాటితో పాటు ద్విచక్ర వాహనాలు కూడా దొంగతనాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో గురువారం మండలంలోని పాతగుంట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని ఒంటిళ్ల గ్రామానికి చెందిన సీజర్ల ప్రతాప్, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన జయరామరాజు, కలిమిచేను గ్రామానికి చెందిన కామసాని రాజశేఖర్ మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా రావడాన్ని గమనించి, పట్టుకున్నారు. విచారణలో మోటారు సైకిల్, మోటార్లు, బ్యాటరీలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ద్విచక్రవాహనం, 5 బ్యాటరీలు, 3 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు విలువ రూ.1,30,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుమలకు వెళ్లి వస్తుండగా ఘటన


మృతిచెందిన శాంతిస్వరూప్

పూతలపట్టు : మండలంలోని బి.కొత్తకోట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ సుదర్శన ప్రసాద్ కథనం.. తవణంపల్లె మండలం ముట్టపల్ల గ్రామానికి చెందిన జనార్ధన్ నాయుడు కుమారుడు శాంతిస్వరూప్ (29) గురువారం తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం ఇంటికి ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. పూతలపట్టు మండలం బి.కొత్తకోట సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెలుతున్న లారీని అతివేగంగా అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శాంతిస్వరూప్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాకాల : చిత్తూరు- పాకాల మార్గంలో ఊట్లవారిపల్లె వద్ద బుధవారం రాత్రి రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు డ్రాయర్, టీషర్ట్ ఉందని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపల ఎంపీ రెడ్డెప్ప, విజయానందరెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. కుర్తాళం సిద్ధేశ్వర పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తిపీఠం స్వామి రమ్యానంద భారతి స్వామి, ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి, పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ, కేంద్ర మాజీ మంత్రి పనబాక కేపీ, తెలంగాణ ఎమ్మెల్సీ టి.మధు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : పిల్లలను పనులో పెట్టుకుంటే కఠిన చర్యలుంటాయని డీఆర్‌ఓ పుల్లయ్య హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా వ్యాప్తంగా జూన్ ఒకటో తేదీ నుంచి 30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకే జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏర్పడిందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని చెప్పారు. 14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో బాల కార్మికులున్నట్‌లెతై గుర్తించి వారిని ఆ పని నుంచి విముక్తలను చేయాలన్నారు. పనుల్లో పెట్టుకున్న వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి జరిమానా విధించాలన్నారు. బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్‌లెతై 1098 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కార్మిక శాఖ కమిషనర్ ఓంకార్‌రావు, దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నాగశైలజ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ క్యాంపస్ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం జూనియర్ బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధాకర్, ఎ.రెడ్డప్ప ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలకు 2009-2019 మధ్య జన్మించిన బాలురు, 2008-2010 మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఆసక్తి ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో పోటీలకు హాజరుకావాలని కోరారు.

ఆర్డీఎస్ఎస్ పనులపై సమీక్ష


మాట్లాడుతున్న విజయానంద్

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ(ఆర్‌డీఎస్ఎస్) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద ఫీడర్లను వేరుచేయడం, అధిక లోడ్ ఫీడర్లను తగ్గించేందుకు అదనపు లైన్లను ఏర్పాటు చేయడం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి, ఫైనాన్స్ కన్సల్టెంట్ వీఎన్ బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, అయూబ్‌ఖాన్, చలపతి, వరకుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 73,811 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,901 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.19 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన చంద్రమౌళిరెడ్డి తదితరులు

చంద్రగిరి : టీడీపీ రౌడీల దాడులు చంద్రగిరిలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అడ్డొచ్చిన వారిని చితకబాదుతూ, చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా తన దుకాణం వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూక దాడి చేసింది. వివరాలు.. తొండవాడకు చెందిన కుమార్ ఆచారి వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్త. కొత్తగుడి వద్ద ఓ ద్విచక్ర వాహనం మెకానిక్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని కుమార్ ఆచారి దుకాణం వద్దే ఉన్నాడు. అతడి దగ్గర పనిచేస్తున్న జహీర్ ఫోన్‌ను దుకాణంలో మర్చిపోవడంతో తీసుకునేందుకు మళ్లీ వచ్చాడు. ఈ క్రమంలో చంద్రగిరికి చెందిన టీడీపీ కార్యకర్త అలీ, మరికొంత మంది యువకులు దుకాణం వద్దకు వచ్చి జహీర్‌పై దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న కుమార్ ఆచారితో పాటు స్థానికులు వారి దాడిని అడ్డుకున్నారు. అక్కడ నుంచి వెళ్లిపోయిన అలీ వెంటనే అఫ్రిదీ, గఫూర్‌లతో పాటు మరికొందరిని తీసుకుని మళ్లీ వచ్చాడు. కుమార్ ఆచారిపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. పరుష పదజాలంతో దూషిస్తూ, కాళ్లు, చేతులతో పిడిగుద్దులు గుద్దారు. ప్రాణభయంతో కుమార్ ఆచారి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడకి చేరుకోవడంతో పచ్చచ మూక అక్కడ నుంచి పరుగులు తీసింది. నిన్ను చంపకుండా వదలమంటూ వారు బెదిరింపులకు పాల్పడినట్లు కుమార్ ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి అక్కడు వచ్చారు. కుమార్ ఆచారిని పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.